

పర్యాటక కేంద్రంగా
తీర్చిదిద్దాలి
● చారిత్రక మామిడి చెరువును పరిశీలించిన మంత్రి భోసరాజు
6
నవ బృందావనంలో
ప్రత్యేక పూజలు
● అనెగొందిలో అభిషేకం నిర్వహించిన మంత్రాలయ పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు



ప్రభలపై దేవదేవుడి వైభవం

కదిరి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): పగటికి అధిపతి సూర్యుడు. రేయికి రారాజు చంద్రుడు. రేయింబవళ్ల కాలాదీనాలనీ, వాటితోపాటు సమస్త విశ్వానికి తానే అధిపతినని చాటి చెప్పే విధంగా లక్ష్మీనారసింహుడు ఆదివారం సూర్య, చంద్రప్రభ వాహనాలపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నిత్యపూజాహోమం అనంతరం సూర్యప్రభ వాహనం పై తిరు వీధుల్లో ఊరేగారు. సంధ్యాసమయంలో చంద్రప్రభ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. విద్యుద్దీపాలు, రంగురంగుల పూలతో అలంకరించిన వాహనాలను అధిరోహించిన శ్రీవారిని దర్శించుకోవడానికి అశేష సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. శ్రీవారి ఉత్సవానికి ముందుభాగంలో సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

నేడు మోహినీ ఉత్సవం

శ్రీఖాద్రీ బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీవారు.. మోహినీ అవతారంలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. ఈ ఉత్సవాన్ని చూడడానికి భక్తులు తండోపతండాలుగా తరలివస్తారు. స్వామివారి వెనుకభాగంలో ఉండే వాలు జడ ఉత్సవం ప్రత్యేకం. కదిరి మల్లెల సౌరభం ఈ ఉత్సవంలో గుభాళించనుంది.

← సూర్యప్రభపై దర్శనమిస్తున్న నారసింహుడు

చంద్రప్రభపై విహరిస్తున్న శ్రీవారు →



ఆర్థిక ప్రగతి

68 శాతమే..!

● నెలాఖరుకు లక్షకోట్ల వినియోగం సవాల్
● పలు శాఖల్లో మూలుగుతున్న నిధులు
● మందకొడిగా అభివృద్ధి పనులు



బెంగళూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ప్రగతి బడ్జెట్‌లో చూపిన స్థాయిలో అమలు కావడం లేదు. 2024-25 ఆర్థిక సంవత్సరం ముగింపునకు మరో రెండు వారాలు మాత్రమే గడువు ఉంది. 2025-26 ఆర్థిక సంవత్సరానికిగాను బడ్జెట్ ప్రవేశపెట్టి పదిరోజులు ముగిసింది. ఏకంగా బడ్జెట్ గాత్రం రూ.4లక్షల కోట్లకు పెరిగింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 11 నెలలు ముగిసే సరికి ఖర్చుల ప్రమాణం 68శాతం మాత్రమే సాధ్యమైంది. ప్రస్తుత ఆఖరునాటికి 32శాతం అంటే సుమారు 1.02 లక్షల కోట్ల రూపాయలు ఖర్చు చేయాల్సి ఉంది. భారీ స్థాయిలో ఖర్చు చేయడం చివరి నెలలో అసాధ్యం అనిపిస్తోంది. దాదాపు మూడు వారాలపాటు శాసనసభ సమావేశాలు జరుగుతుండడంతో ముఖ్య అధికారులంతా కలాపాలపైనే దృష్టి సారించారు. ఇతరత్రా సంబంధిత శాఖల ద్వారా ప్రగతిని పర్యవేక్షించేందుకు వీలు కావడం లేదు. రెవెన్యూ శాఖ, విపత్తు నిర్వహణా విభాగం వందశాతం గ్రాంటు ఖర్చు చేసింది. పర్యాటకశాఖ కూడా ముగించింది. మిగిలిన శాఖల్లో భారీగా గ్రాంట్లు మిగిలిపోయాయి. సరాసరి 68శాతం కంటే తక్కువగానే ఖర్చు అయ్యింది. మరో రెండు వారాలలో లక్ష కోట్ల రూపాయల సద్వినియోగం సాధ్యం కానుందా ప్రశ్నార్థకంగా మారింది.

ఆ రెండు శాఖల్లోనే లక్ష్యం పూర్తి

సిద్దరామయ్య రెండోసారి ముఖ్యమంత్రి అయ్యాక 2024-25లో బడ్జెట్‌లో శాఖలకు రూ.3.07 లక్షలకోట్లు కేటాయించారు. ప్రారంభపు నిల్వ రూ.14,142 కోట్లతో కలిపి రూ.3.22 లక్షల కోట్లు శాఖల వారీగా ఖర్చు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఆర్థిక సంవత్సరంలో 11 నెలలు ముగిసేసరికి 68.29 శాతం మాత్రమే సాధ్యమైంది. పర్యాటకశాఖకు రూ.240కోట్లు కేటాయించారు. ఇతర గ్రాంట్లతో కలిపి రూ.356.91 కోట్లు విడుదల చేశారు. అందులో రూ.337 కోట్లు ఖర్చు చేయడం ద్వారా ఏడాది లక్ష్యాన్ని సాధించింది. రెవెన్యూశాఖ విపత్తు నిర్వహణా విభాగానికి రూ.11,595 కోట్లు కేటాయించారు. కేంద్రప్రభుత్వం సాయం, పరిహారంతో కలిపి మొత్తం 14,005 కోట్లు కాగా అందులో రూ.13,107 కోట్లు ఖర్చు చేశారు. ఈ రెండు శాఖలు వందశాతం లక్ష్యాన్ని చేరుకున్నాయి.

నిధులన్నీ పథకాలకే..!

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం నాల్గో త్రైమాసికం రెండో నెల ఫిబ్రవరి ముగిసేసరికి ప్రభుత్వం శాఖల వారీగా విడుదల చేసిన మొత్తం రూ.2.50 లక్షలకోట్లు కాగా కేటాయింపుల మొత్తాన్ని పరిశీలిస్తే 77శాతం మాత్రమే విడుదలైంది. అందులోనూ 87శాతం అంటే రూ.2.19 లక్షల కోట్లు ఖర్చు చేశారు. ప్రభుత్వం 71,401 కోట్ల రూపాయలు విడుదల చేయాల్సి ఉంది. ఇంతమొత్తం రెండో వారాలలో ఖర్చు చేయాల్సి ఉంటుంది. శాఖలవారీగా కేటాయించే గ్రాంట్లలో అధికారులు, ఉద్యోగుల వేతనాలు, భత్యం, పింఛన్‌లు, ఇతరత్రా ఖర్చులకు నిధులు పెండింగ్‌లో ఉంచి మిగిలిన గ్రాంట్లు, అభివృద్ధి పథకాలు, ఇతరత్రా అమలు చేస్తున్న కార్యక్రమాలు, నిర్దిష్టమైన పథకాల కార్యక్రమాలకు వినియోగించాల్సి ఉంది.

కీలకశాఖలే వెనుకడుగు

కోట్లాదిమంది ప్రజలకు అనుబంధంమైన కీలకశాఖలే గ్రాంట్ల వినియోగంలో వెనుకడుగు వేస్తున్నాయి. అందులో గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్‌శాఖ, జలవనరులు, వాణిజ్య, పారిశ్రామికశాఖలు కేటాయింపులలో 50శాతం కూడా వినియోగించుకలేపోయాయి. సాంఘికసంక్షేమ శాఖ 75.59 శాతం, ఎస్టీ సంక్షేమ విభాగం 46శాతం, బీసీ సంక్షేమం 60.5 శాతం, మైనారిటీ, హజ్, అభివృద్ధిశాఖ 65.4శాతం మాత్రమే గ్రాంట్లు ఖర్చు చేశాయి. 2024-25 ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికం డిసెంబరు ముగిసేసరికి కేవలం 54శాతం మాత్రమే సద్వినియోగం అయ్యింది. అ తర్వాత చివరి నాల్గో త్రైమాసికం జనవరి, ఫిబ్రవరిలలో 14శాతం మాత్రమే ఖర్చు చేశారు.

మరో 15 రోజులు భారీగా ఖర్చులు

ఆర్థిక సంవత్సరం ముగింపునకు మరో రెండు వారాలు మాత్రమే గడువు ఉంది. ఇంకా ఐదు రోజులపాటు శాసనసభ సమావేశాలు కొనసాగుతాయి. ఆ తర్వాత పది రోజులు భారీగా ఖర్చులు చేయనున్నారు. దాదాపు అన్నిశాఖలు పెండింగ్ బిల్లులు క్లియర్ చేసేందుకు కసరత్తు సాగిస్తున్నాయి. గ్రామస్థాయి నుంచి తాలూకా, జిల్లా కేంద్రాల్లో వివిధ కారణాలతో పెండింగ్‌లో పెట్టిన బిల్లులను క్లియర్ చేసేందుకు అధికారులు, ఇంజనీరు ప్రయత్నిస్తున్నారు. పదిరోజుల్లో బిల్లులు మంజూరు కాలేదంటే, ఆ తర్వాత నెలలతరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. అందుకే కీలకశాఖల్లో రాత్రింబవళ్ల పని చేస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఈనెల 25లోగా అన్ని బిల్లులకు మోక్షం కల్పించాలని భావిస్తున్నారు.

శాఖల వారీగా మిగిలిన నిధులు

శాఖలవారీగా 3,22,045 కోట్ల రూపాయలు కేటాయించగా ఫిబ్రవరి చివరినాటికి 2,50,644 కోట్ల రూపాయలు విడుదల చేశారు. విడుదలైన మొత్తంలో ఫిబ్రవరి నాటికి 2,19,940 కోట్ల రూపాయలు సద్వినియోగమైంది. మార్చిలో 71,401 కోట్లు ఖర్చు చేయాల్సి ఉంది. గ్రామీణాభివృద్ధి, పంచాయతీశాఖ కేటాయింపులు రూ.25,084 కోట్లకు గానీ 48.31శాతం, జలవనరులు శాఖలో రూ.16,832 కోట్లకు గాను 49.16శాతం, పౌర ఆహార సరఫరాలశాఖ రూ.9,978 కోట్లకు గాను 55.64శాతం, వైద్య ఆరోగ్యశాఖ రూ.11,264 కోట్లకుగాను 63శాతం, విద్యాశాఖ 38,651 కోట్లకు గాను 67.42 శాతం, ప్రజాపనులశాఖ 9926 కోట్లకు గాను 69.14శాతం, చిన్నతరహా నీటిపారుదల శాఖ రూ.2,388 కోట్లకుగాను 75.14శాతం ఖర్చు చేశారు. అత్యల్పంగా ఖర్చు చేసిన శాఖలలో ప్లానింగ్ అండ్ స్టాటిస్టిక్స్ విభాగంలో రూ.7018 కోట్లకుగాను 8.63శాతం, పాలనా సంస్కరణలు (డీపీఏఆర్) విభాగానికి రూ.335 కోట్లకుగాను 9.17 శాతం, ఐటీ బీటీ సైన్స్ టెక్నాలజీ విభాగానికి 922 కోట్లకుగాను 19.76శాతం, ఎస్టీ సంక్షేమానికిగాను రూ.1718 కోట్లకుగాను 46.23 శాతం, చిన్నతరహా పరిశ్రమలు రూ.1247 కోట్లకుగాను 48.58శాతం మాత్రమే ఖర్చు చేశారు.



మీడియాతో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర

కులాల మధ్య చిచ్చుకు కుట్ర

● సీఎం సిద్దరామయ్యపై విజయేంద్ర ధ్వజం


బెంగళూరు, మార్చి 16(ఆంధ్రజ్యోతి): కులాలు, మతాల మధ్య చిచ్చు పెట్టేందుకు సీఎం సిద్దరామయ్య కుట్ర పన్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర ఆరోపించారు. బెళగావిలో ఆదివారం మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ కాంట్రాక్టు పనుల్లో ముస్లింలకు రిజర్వేషన్ ఇవ్వడం సరికాదన్నారు. రాజ్యాంగం ప్రకారం మతం ఆధారంగా రిజర్వేషన్ ఇవ్వాలని ప్రస్తావన లేదన్నారు. ప్రభుత్వ నిర్ణయం రాజ్యాంగ వ్యతిరేకమన్నారు. కేవలం ఒక సామాజిక వర్గం మెప్పు పొందేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం దిగజారుడు చర్యలకు పాల్పడుతోందన్నారు. శాసనసభలోనూ బయటా తీవ్రమైన పోరాటం చేస్తామన్నారు. ముస్లింలకు నాలుగుశాతం రిజర్వేషన్‌ను బడ్జెట్‌లో ప్రకటించారని, తాజాగా కేబినెట్‌లోనూ తీర్మానించారన్నారు. జేడీఎస్‌తో కలసి ప్రభుత్వంపై పోరాటం చేస్తామని హెచ్చరించారు. విశ్వవిద్యాలయాలను మూసివేయాలనే కుట్రను అడ్డుకున్నందుకు వెంటనే వెనుకడుగు వేశారన్నారు. మైక్రో ఫైనాన్స్‌పై బిల్లు తెచ్చారని ఇప్పటికే ఎంతో మంది సామాన్యులు మైక్రోఫైనాన్స్‌ల ధాటికి ఇబ్బంది పడ్డారన్నారు. బెళగావిలో మరోసారి బీజేపీ పాలకవర్గం ఏర్పడ్డం సంతోషంగా ఉందన్నారు.

పరుగో.. పరుగు..!

● దావణగెరెలో సినీ ఫక్కీలో చేజింగ్
● బ్యాంక్ దోపిడీకి వచ్చిన ముఠాపై ఫైరింగ్
● నలుగురిని అరెస్టు చేసిన పోలీసులు



బెంగళూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): బ్యాంకు దోపిడీకి పథకం వేసి ఉత్తరప్రదేశ్ నుంచి వస్తున్న దోపిడీ దుండగులను దావణగెరెలో సినిమా రీతిలో చేజింగ్, ఫైరింగ్ చేసి పోలీసులు నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. దావణగెరె జిల్లా హొన్నాళి తాలూకా అరబఘట్ట గ్రామం వద్ద ఆదివారం ఉదయం ఉత్తరప్రదేశ్ రిజిస్ట్రేషన్‌కు చెందిన రెండు కార్లలో వచ్చిన దుండగులపై పోలీసులు ఫైరింగ్ చేశారు. దుండగులకు సంబంధించిన ఖచ్చితమైన సమాచారం మేరకు కడదకట్టె చెక్‌పోస్ట్ వద్ద హొన్నాళి పోలీసులు గంటకుపైగా తనిఖీలు చేశారు. అదే సందర్భంగా ఉత్తరప్రదేశ్ రిజిస్ట్రేషన్‌తో రెండు కార్లు రావడాన్ని గుర్తించారు. అయితే కారులోనివారు ఆపకుండా వెళ్లడంతో పోలీసులు కూడా వెంటనే చేజింగ్ చేశారు. న్యామతి పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రవి నేతృత్వంలోని బృందం ఎట్టకేలకు వాహనాలను అడ్డగించారు. వెంటనే రెండు కార్లలోని ఏడుగురు తప్పించుకునేందుకు ప్రయత్నించగా లొంగిపోవాలని హెచ్చరించారు. దీంతో గాలిలోకి రెండు రౌండ్లు కాల్పులు జరిపి అనంతరం గుడు ఖాలియా కాలిపై ఫైరింగ్ చేయడంతో అతను కుప్పకూలాడు. వెంటనే అతడితోపాటు ఉత్తరప్రదేశ్‌కు చెందిన హస్రత్ అలి, అసాయానెటన్, కుమరన్ యానెబాబులను అరెస్టు చేశారు. ఇలా మొత్తం నలుగురిని అరెస్టు చేయగా పారిపోయిన ముగ్గురికోసం గాలింపులు చేపట్టారు. గ్యాంగ్‌లో కీలకసూత్రధారి రాజారామ్, బాబుషా, కోలారు జిల్లా మాలూరు తాలూకాకు చెందిన హఫీజ్ పరారయ్యారు. వీరికోసం నాలుగు బృందాలు ఏర్పాటు చేసినట్టు దావణగెరె ఎస్పీ ఉమా ప్రశాంత్ మీడియాకు తెలిపారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన కక్రాశ్ గ్యాంగ్‌గా వీరిని పిలుస్తారని తెలుస్తోందన్నారు. వీరు సవళంగలోని బ్యాంకు దోపిడీకి వచ్చినట్టు సమాచారం ఉందన్నారు. గత నెల న్యామతిలోని ఎస్‌బీఐ బ్యాంకు దోపిడీకి వీరికి ఏమైనా సంబంధం ఉందా కోణంలో ఆరా తీస్తున్నట్టు తెలిపారు. కాగా దుండగులను నియంత్రించడంలో గాయపడిన కానిస్టేబుల్ ఆనంద్‌ను న్యామతి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఫైరింగ్‌కు గురైన దుండగుడిని దావణగెరె జిల్లా ఆసుపత్రిలో చేర్పించారు.



అన్నభాగ్యం..!

● అక్రమార్కులకు వరంగా మారిన 'అన్నభాగ్య' బియ్యం
● యథేచ్ఛగా బ్లాక్ మార్కెట్‌కు తరలింపు
● సరిహద్దులో సహకరిస్తున్న పోలీసులు..!
● జిల్లావ్యాప్తంగా ముఠాలుగా మారిన వ్యాపారులు



బళ్లారి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): పేదల ఆకలి తీర్చడానికి రూ.కోట్లు ఖర్చు పెట్టి ప్రభుత్వం సరఫరా చేస్తున్న 'అన్నభాగ్య' బియ్యం అక్రమార్కుల పాలిట వరంగా మారింది. యథేచ్ఛగా పక్క జిల్లాలు, రాష్ట్రాలకు తరలిస్తూ లక్షలకు లక్షలు లాభాలు గడిస్తున్నారు. అక్రమ బియ్యం వ్యాపారుల్లో ముఠాలుగా ఏర్పడి దందా కొనసాగిస్తున్నారు. బియ్యం సేకరించే ముఠా జిల్లా నుంచి తుమకూరు. మంగళూరు, హైదరాబాద్, మహారాష్ట్రలకు వివిధ మార్గాల్లో తరలిస్తున్నారు. అన్నభాగ్య బియ్యం అక్రమంగా ఇతర రాష్ట్రాలకు తరలించే ముఠా పై చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం ఉత్తుత్తి ప్రకటనలే తప్ప, చర్యలు శూన్యమని విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ ముఠా పోలీసులు, చోటామోటా ప్రజాప్రతినిధులకు నెలవారీ ముడుపులు ముట్టజెప్పి తమ పనులు సాగిస్తున్నారని ఆరోపణలు విని పిస్తున్నాయి.

ఒక్కొక్కరికి 10 కేజీల బియ్యం..

రాష్ట్ర ప్రభుత్వం ప్రతి బీపీఎల్ లబ్దిదారులకు 10 కిలోల బియ్యం ఉచితంగా సరఫరా చేస్తుంది. ఇక కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన సబ్సిడీని నేరుగా లబ్దిదారుల ఖాతాలో ఒక్కొక్కరికి రూ. 170 వరకూ సిద్దరామయ్య ప్రభుత్వం లబ్దిదారుల ఖాతాలో జమ చేసేది. అయితే ఈ నెల నుంచి 10కిలోల బియ్యం సరఫరా చేస్తున్నారు.బళ్లారి జిల్లాలో సుమారు 2,43,088 మంది అన్నభాగ్య లబ్దిదారులు ఉన్నారు. ఇక విజయనగర జిల్లాలో 2,13.098 మంది లబ్దిదారులున్నారు. ప్రభుత్వ చౌకధాన్య డిపోలు నుంచి బియ్యం లబ్దిదారులు పొందుతారు. కొందరు రేషన్ డీలర్లు షాపులోనే బియ్యం లబ్దిదారులతో కిలో రూ. 10 నుంచి 12 వరకూ కొనుగోలు చేస్తారు. మరి కొందరు లబ్దిదారులు నేరుగా దళారులకే అమ్ముకుంటారు. ఇలా పేదల నుంచి కొన్న బియ్య తిరిగి మధ్యవర్తి మరో వ్యాపారికి అమ్ముకుంటాడు. ఇలా మూడునాలుగు అంచలు దాటి బియ్యం ఏకంగా రాష్ట్రం దాటిపోతుంది. జిల్లా నుంచి బియ్యాన్ని తుమకూరుకు చెందిన ప్రముఖ వ్యాపారి కొనుగోలు చేస్తున్నారని సమాచారం. మరి కొందరు మంగళూరు వరకూ తరలించి అక్కడ నుంచి ఓడరేవుల ద్వారా ఇతర దేశాలకు తరలిస్తున్నారు. రేషన్ బియ్యం ఎక్కువగా అక్కడ కిలో రూ. 60 వరకూ అమ్ముడు పోతున్నాయి. ఇక తుమకూరు లాంటి ప్రాంతాల్లో ఇదే బియ్యంతో ఉప్మారవ్వ తయారు చేసి, దాన్ని ప్యాకెట్లలో సీజ్ చేసి ఏకంగా కిలోల ప్రకారం హాస్టళ్లకు, ఇతర సంస్థలకు విక్రమాలు సాగిస్తున్నారని సమాచారం.



సహకరిస్తున్న పోలీసులు..!

సరిహద్దుల్లో బియ్యాన్ని దాటించేందుకు అక్రమ రవాణా ముఠా పోలీసులకు నెలానెలా మామూళ్లు చెల్లిస్తున్నట్లు సమాచారం. బళ్లారి, రాయచూరు, విజయనగర జిల్లాలకు ఆంధ్ర, తెలంగాణా, మహారాష్ట్ర రాష్ట్రాల సరిహద్దులు ఉన్నాయి. బళ్లారి నుంచి బెంగళూరు, తుమకూరు ప్రాంతాలకు బియ్యం అక్రమ రవాణా చేయాలంటే సరిహద్దు పోలీసులకు నెలనెల మామూళ్లు చెల్లిస్తున్నట్లు సమాచారం. డి.హీరేహాళ్‌కు చెందిన ప్రముఖ నాయకుడు పోలీసులతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలుస్తోంది. బియ్యం లారీ వచ్చినప్పుడు పోలీసులకు సమాచారమిచ్చి లైన్ క్లియర్ చేసుకుంటున్నారు. లారీకి రూ.40 వేలు చెల్లిస్తున్నట్లు కొందరు పేర్కొంటున్నారు. బళ్లారి నుంచి ప్రతి నెలా 15 లారీలు తరలుతున్నట్లు సమాచారం. ఇక ఆటోలు, ఐచర్లలో తరలించడానికి మరో రేటు నిర్ణయించినట్లు తెలుస్తోంది. యథేచ్ఛగా బియ్యం తరలిపోతున్నా పట్టడం లేదు.

ముఠాల మధ్య ఘర్షణలు

అక్రమంగా బియ్యం రవాణా చేసే వ్యక్తులు కొన్ని ముఠాలుగా ఏర్పడ్డారు. గతంలో ముఠాల మధ్య ఆధిపత్య పోరులో బళ్లారికి చెందిన ఓ వ్యక్తిని హత్య చేశారు. ఇక రామపురం వద్ద ఉండే ఒక వ్యక్తి కూడా ఘర్షణ పడి దాడిచేశారు. ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయి. అక్రమ సంపాదనే ధ్యేయంగా ముఠా కార్యకలాపాలు సాగిస్తుంది. పేదల ఆకలి తీర్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీ బియ్యం పంపిణీకి రూ. కోట్లు వెచ్చించింది. కానీ స్వార్థపరుల చేతిలో పేదలకు అందాల్సిన సబ్సిడీ బియ్యం సక్రమంగా అందకుండా పోతున్నాయి.

గ్రామాల్లో బియ్యం నిల్వలు

బళ్లారి, రాపురము మధ్యలో ఉండే డి.హీరేహాళ్ సరిహద్దులో జాజురకల్లు, హిర్దేహాల్, ఓబుళాపురం, లాంటి సరిహద్దులో ఉంచుతున్నారు. రవాణాకు అనుకూలంగా ఉండే ప్రాంతంలో బియ్యం నిల్వలు ఉంచి అటు నుంచి అటే తరలిస్తున్నారు. బళ్లారిలో ఉండే ఒక అధికార పార్టీ నాయకుడు, రాయదుర్గం నియోజక వర్గంలో ఉండే ఒక అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లో అక్రమ రవాణా సాగుతున్నట్లు తెలుస్తోంది.అక్రమంగా బియ్యం రవాణా చేసే వ్యక్తులు కొన్ని ముఠాలుగా ఏర్పడ్డారు. గతంలో ముఠాల మధ్య ఆధిపత్య పోరులో బళ్లారికి చెందిన ఓ వ్యక్తిని హత్య చేశారు. ఇక రామపురం వద్ద ఉండే ఒక వ్యక్తి కూడా ఘర్షణ పడి దాడిచేశారు. ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయి. అక్రమ సంపాదనే ధ్యేయంగా ముఠా కార్యకలాపాలు సాగిస్తుంది. సబ్సిడీ బియ్యం పంపిణీకి రూ. కోట్లు వెచ్చించింది. కానీ స్వార్థపరుల చేతిలో పేదలకు అందాల్సిన సబ్సిడీ బియ్యం సక్రమంగా అందకుండా పోతున్నాయి.


సమాచారం ఇస్తే చర్యలు తీసుకుంటాం : ఎస్పీ

అన్నభాగ్య బియ్యం అక్రమంగా బ్లాక్ మార్కెట్‌కు తరలించే వారి సమాచారం ఇస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ శోభారాణి తెలిపారు. గతంలో అనేక దాడులు చేసి బియ్యం సీజ్ చేశామన్నారు. కంప్లి, సిరుగుప్ప, బళ్లారి, సండూరు తదితర ప్రాంతాల్లో దాడులు చేశామని తెలిపారు. ఎవరైనా అక్రమంగా అన్నబాగ్య బియ్యం ఇతర ప్రాంతాలకు అక్రమంగా తరలిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేసి జిల్లా బహిష్కరిస్తామని పేర్కొన్నారు. బియ్యం రవాణా ముఠాలను తిప్పికొడతామన్నారు. అనంతపురం జిల్లా ఎస్పీతో కూడా మాట్లాడి అక్రమంగా బియ్యం రవాణా అరికడుతామన్నారు.



రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6.47 (సోమవారం సాయంత్రం)
సెహరీ : 5.14 (మంగళవారం ఉదయం)

కిడ్నీ సమస్యలపై వాకథాన్ 7లో ఘనంగా వేణుగోపాల స్వామి రథోత్సవం



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1599.49	1,583.00
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	0	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	6,925	2.129
నీటి నిల్వ (టీఎంసీలు)	20.88	6.09



మృతి చెందిన కోళ్లను చూపుతున్న పరమేశ్వర

మూడు వేల కోళ్లు మృతి

కంప్లి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): హడగలి తాలుకాలోని దుగ్గవతి గ్రామం ఖండికేరి తండాలో కోళ్లఫారంలో మూడు రోజుల్లో మూడు వేల కోళ్లు మృతి చెందాయి. కొత్తూరులోని ఫారంలో పరమేష్ నాయక్ కోళ్లను పెంచుతున్నారు. గత రెండు రోజుల క్రితం దావణగెరె లోని ఒక ప్రైవేటు దుకాణంలో ఆహారం కొనుగోలు చేసి కోళ్లకు ఆహారం అందించారు. ఆదివారం ఒక్కసారిగా 15కు పైగా కోళ్లు మృతి చెందాయి. అదే ఈ రోజు కోళ్లన్నీ చనిపోయాయని పరమేశ్వర తెలిపారు. కోళ్ల మృతితో భారీగా నష్టపోయానని, ప్రభుత్వం నష్టపరిహారం అందేలా చూడాలని పరమేశ్వర కోరారు.

వార్డుల అభివృద్ధికి కృషి చేస్తా

● ఎమ్మెల్సీ వసంత్ కుమార్



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్సీ వసంత్ కుమార్

రాయచూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): నగరంలో అన్ని వార్డులను సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం నిబద్ధతతో కృషి చేస్తున్నట్లు కేపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ ఎ.వసంత్ కుమార్ అన్నారు. నగర పరిధిలోని 21వ వార్డులో రెండోన్నర కోట్లతో చేపట్టే సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు ఆదివారం వసంత్ కుమార్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన వసంత్ కుమార్, రాయచూరు ఇప్పటికే మహానగర పాలికగా పదోన్నతి పొందిన నేపథ్యంలో పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం కావల్సినన్ని నిధుల విడుదల చేసేందుకు సిద్దంగా ఉందన్నారు.

ఏప్రిల్ 10 వరకు ఎల్ఎల్‌సీకి నీరు వదలాలి

● కలెక్టర్‌కు రైతుసంఘం వినతి



కలెక్టర్‌కు వినతి పత్రం అందిస్తున్న రైతు సంఘం నాయకులు

బళ్లారి సిటీ, మార్చి 16(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర ఎల్ఎల్‌సీ కాలువకు ఏప్రిల్ 10వరకు తాగునీటిని విడుదల చేయాలని కోరుతూ తుంగభద్ర రైతు సంఘం జిల్లాకలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించింది. ఈసందర్భంగా రైతు సంఘం అధ్యక్షుడు పురుషోత్తమగౌడ మాట్లాడుతూ జిల్లాలోని కంప్లి, కురుగోడు, సిరుగుప్ప, బళ్లారి గ్రామీణ ప్రాంతాల్లో తుంగభద్ర ఎల్ఎల్‌సీ కెనాల్ కింద దాదాపు రెండు లక్షల ఎకరాల్లో రైతులు వరి పంటను సాగు చేశారు. తుంగభద్ర రైతు సంఘం జిల్లా, తాలూకా, గ్రామా యూనిట్ల జిల్లా ప్రతినిధులు, నీటిపారుదల అధికారులు, వ్యవసాయ అధికారులు, తుంగభద్ర బోర్డు అధికారుల సమావేశం ఏర్పాటు చేసి, ఆంధ్రప్రదేశ్‌నుండి రోజువారీ 850 క్యూసెక్‌ల నీటితో పాటు మన కర్ణాటక నుండి 600క్యూసెక్‌ల నీటిని ఎల్ఎల్‌సీ కాలువకు విడుదల చేయడానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పంటల సాగు పుష్కలంగా ఉన్న సమయంలో నీరు అవసరమన్నారు. ఈసందర్భంగా నాయకులు ముష్టగట్టి భీమనగౌడ, శ్రీధరగడ్డ వీరనగౌడ, పురుషోత్తంగౌడ, కొంచిగేరి గోవిందప్ప,వీరభద్ర, చంద్రశేఖర్ గౌడ, రాజసాబ్, దాసప్ప, అంజినప్ప, మహేశ్‌గౌడ, ఖాజావలిసాబ్, తిప్పేరుద్రగౌడ తదితరులు పాల్గొన్నారు.

వాణిజ్య మండలిలో కీలక ఒప్పందం



మొక్కకు నీరు పోసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వాణిజ్య పదాధికారులు

బళ్లారి సిటీ, మార్చి16(ఆంధ్రజోతి): వాణిజ్య, పరిశ్రమల అభివృద్ధికి పరస్పరం సహకరించుకోవడానికి బళ్లారి జిల్లా వాణిజ్య, మైసూర్ జిల్లా వాణిజ్య పరిశ్రమల మండలి మధ్య ఆదివారం ఒప్పందం కుదిరింది. బళ్ళారి జిల్లా వాణిజ్య ,పరిశ్రమల మండలి అధ్యక్షుడు యశ్వంతరాజ్ నాగిరెడ్డి, మైసూరు చేంబర్ అధ్యక్షుడు లింగరాజు ఈ ఒప్పందంపైసంతకం చేశారు. ఈ సందర్భంగా యశ్వంత్‌రాజ్ నాగిరెడ్డి మాట్లాడుతూ.. బళ్లారిలోని సంస్థ కేవలం వాణిజ్యం, వాణిజ్యానికి పరిమితం కాకుండా యువత భవిష్యత్తును రూపొందించడంలో సహాయపడటానికి నైపు ణ్య అభివృద్ధి రైతు భోజనం రైతు క్లినిక్ రైతు నివాసం కార్యక్రమాలను అమలు చేసిందన్నారు. లింగరాజ్ మాట్లాడుతూ బళ్లారి జిల్లా వాణిజ్య పరిశ్రమల మండలితో కుదిరిన ఒప్పందంరెండు జిల్లాల వ్యాపార రంగంలో అవిష్కరణలకు అవకాశం కల్పించిందన్నారు.ఈసందర్భంగా రెండు జిల్లాల వాణిజ్య, పారిశ్రామిక సంస్థల ఆఫీస్ బేరర్లు సమావేశంలో పాల్గొన్నారు.

కళావైభవాన్ని కాపాడుకోవడం అందరి బాధ్యత

●రాయచూరు ఎంపీ కుమార్ నాయక్



జ్యోతి వెలిగించి చిత్రకళా మేళాను ప్రారంభిస్తున్న ఎంపీ కుమార్ నాయక్

రాయచూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : ప్రాచీన కళలు, సాంస్కృతిక వైభవాలకు కన్నడ ప్రాంతం ఆలవాలమని అలనాటి వైభవాన్ని కాపాడుకోవడం మనందరి బాధ్యత అని రాయచూరు ఎంపీ జీ కుమార్ నాయక్ అన్నారు. నగరంలోని రంగమందిరంలో ఆదివారం ఏర్పాటు చేసిన చిత్రకళా మేళాను ఎంపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, కళాకారులు రూపొందించిన వివిధ చిత్రకళలను సందర్శించిన ఎంపీ కళావైభవాన్ని కాపాడుకోవడంతో పాటు నేటి తరం కళాకారులను ప్రోత్సహించేందుకు ఇలాంటి వేదికలు తోడ్పడుతాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు గిచిన చిత్రాలు అందరిని ఆకట్టుకున్నాయి. మహనీయుల చాత్రపటాలు వివిధ రూపాల్లోని బుద్ధిడి రూపాలు, గ్రామీణ ప్రాంతాల వైభవం చిన్నారులు ఆటలాడుకునే చిత్రాలను ప్రేక్షకులు ఉత్సహంగా తిలకించారు.

శిథిలావస్థకు చేరిన దుకాణాల తొలగింపు



దుకాణాలను కూల్చేస్తున్న అధికారులు

సిరుగుప్ప, మార్చి 16(ఆంధ్రజ్యోతి): శిథిలావస్థకు చేరిన వాణిజ్య షాపులను నగరసభ ఆధ్వర్యంలో జేసీబీ యంత్రాల ద్వారా తొలగించారు. సిరుగుప్ప పట్టణం ఆదోని రోడ్డు మార్గంలో పలు దుకాణాలు పాతబడ్డాయి. ఇవి కూలితే ప్రమాదం తప్పదని, అధికారులు తొలగింపు చర్యలు చేపట్టారు. వీటితో పాటు ఫుట్‌పాత్‌లో వున్న దుకాణాలను తొలగించడంతో యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నరు. అధికారులు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి

● చారిత్రక మామిడి చెరువును పరిశీలించిన చిన్ననీటి పారుదల శాఖ మంత్రి ఎన్ఎస్ భోసరాజు



చెరువును పరిశీలిస్తున్న మంత్రి భోసరాజు

రాయచూరు, మార్చి 16(ఆంధ్రజ్యోతి): నగరం నడిబొడ్డిలో ఉన్న చారిత్రక మామిడి చెరువును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్ది అందుబాటులోకి తేవాలని రాష్ట్ర చిన్ననీటి పారుదల శాఖ మంత్రి ఎన్.ఎస్.భోసరాజు సూచించారు. రాయచూరు ఎంపీ జీ కుమార్ నాయక్, జిల్లాధికారి నితీశ్‌లతో కలిసి ఆదివారం మంత్రి చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడిన మంత్రి చెరువు స్వచ్ఛత పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, దీంతో పాటు పర్యాటక అభివృద్ధికి కావల్సిన పనులను సకాలంలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలన్నారు. ముఖ్యంగా పర్యాటకానికి వచ్చే ప్రజలకు జల విహారానికి కావల్సిన పనులు వెంటనే పూర్తి చేయాలన్నారు. జిల్లా కేంద్రంలో నిర్మించతలపెట్టిన ప్రాంతీయ ఉప విజ్ఞాన కేంద్రం పనులకు లైన్ క్లీయర్ అయ్యింది. భవన నిర్మాణానికి సంబంధించి రాష్ట్ర చిన్ననీటి పారుదల, శాస్త్ర సాంకేతిక విద్య శాఖల మంత్రి ఎన్.ఎస్.భోసరాజు సమక్షంలో అధికారులు డీపీఆర్‌ను సిద్ధం చేశారు. నగరంలోని విజ్ఞాన కేంద్రం వద్ద జిల్లాధికారి నితీశ్, అధికారులతో మంత్రి చర్చించారు.



పూజలు నిర్వహిస్తున్న సుబుదేంద్ర తీర్థ స్వామి

నవ బృందావనంలో ప్రత్యేక పూజలు

కంప్లి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): గంగావతి తాలుకా పరిధిలోని ఆనేగొంది నవ బృందావనం వద్ద ఆదివారం మధ్య వారసత్వానికి చెందిన సుదీంద్ర తీర్థ స్వాములు, పాదరాజ మఠ పీఠాధిపతి శ్రీ సుజయనిధి తీర్థ సన్నిధిలో నిర్మల్య వస్కరం, పంచామృతాభిషేకం, విశేష పుష్పాలంకరణ, అష్టోత్తర పారాయణం, పండితులు ద్వారకానాథ్ ఆచారి, గుంజల్లి నరహరి ఆచారి, విజయల ప్రిణిగా ఆచారణతో బృందావనాలను పూర్తి చేశారు. ప్రహ్లాద కులకర్ణి, హేరూరు గోపి, హేరూరు ప్రహల్లాద, ముక్తాదార్ వామనరావు, గురురాజ చల్లారి, సుధీర కులకర్ణి, సుశీలేంద్ర ఆచారి, మోహిత్, హోస్పేట పాత రాయర్ మఠానికి చెందిన భీమసేన ఆచారి, పవన్ ఆచారి, మంత్రాలయానికి చెందిన చరణ్, మురళి, ప్రకాష్, గోపి, ప్రవీణ్, ఇడపనూరు సంజీవ్ కులకర్ణి, విజయేంద్ర చల్లారి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నుల పంపిణీ



ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేస్తున్న ఎంజీ కనక రమేష్

బళ్లారిరూరల్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): బళ్లారిరూరల్‌లో కక్కబేవనహళ్లి ప్రభుత్వ పాఠశాలలో 250 మంది విద్యార్థులకు కింగ్ ధృవసర్జ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఎంజీ కనక ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంజీ కనక మాట్లాడుతూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కరోనా సమయం నుంచి సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నామన్నారు. విద్యార్థులు ధైర్యంగా పరీక్షలు రాసి ఉత్తమ మార్కులు సాధించాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం శేషమ్మ, కేఎస్‌జే యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎర్రగుడి రమేష్ అమలాపురం, సంగనకల్లు ఆత్మ మిత్ర బాష గురు, శాంతప్ప, రామకృష్ణ గ్రామ పంచాయతీ సభ్యులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వ్యాసరాయల ఆరాధనోత్సవాలు



వ్యాసరాయ బృందావనం

గంగావతి రూరల్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): వ్యాసరాయ గురుసార్వభౌమ 486వ ఆరాదనోత్సవాలు 17 నుంచి 19వ తేదీ వరకు గంగావతి తాలూకాలోని ఆనేగుందిలోన నవ బృందావన్‌లో జరగనుంది. ఈ ఆరాధనోత్సవాన్ని వ్యాసరాజ మఠం నిర్వహిస్తుంది, మార్చి17న పూర్వారాధన మార్చి 18న మద్యారాధన జరుగ్యుతాయి. మఠం అధిపతి విద్యాశ్రీష తీర్థ సమక్షంలో ఈ కార్యక్రమం జరగనుంది. మూడు రోజుల పాటు పంచామృతాభిషేకం, పండితుల ప్రవచనాలు, పండిత సమ్మేళనం నిర్వహించనున్నారు. శ్రీపాదరాజ మఠానికి చెందిన సుజయని తీర్థ, వారరాజ మఠానికి చెందిన విశ్వవల్లభ తీర్థ పూజలకు హాజరవుతారు. సన్యాసులకు అవార్డుల ప్రధానంతో సహా వివిధ మతరమైన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మఠం నిర్వాహకులు తెలిపారు.

కొండకు నిప్పు.. వృక్షాలు బుగ్గి



ఉచ్చంగి దుర్గ కొండపై చెలరేగుతున్న మంటలు

కంప్లి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): హడగలి తాలుకాలోని ఉచ్చంగి దుర్గలో చారిత్రాత్మక కొండపై ఆదివారం రాత్రి మంటలు ఏర్పడి పలు చెట్లు కాలి బూడిదయ్యాయి. అగ్ని ప్రమాదం జరగడంతో కోట పరిసరాల్లో నివసిస్తున్న కుటుంబాలు ఆందోళన చెందాయి. కొండకు మంటలు ఏర్పడటంతో రాత్రివేళల్లో కొండపై భక్తులు ఇబ్బందులకు గురయ్యారు. మంటలతో వన్యప్రాణులు పరుగులు తీశాయి. అటవీ అధికారులు కొండ చుట్టూ మంటలు ఆర్పడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

ఘనంగా యోగి నారాయణ జయంతి



యోగి నారాయణకు నివాళి అర్పిస్తున్న తహసీల్దార్, సిబ్బంది

సిరుగుప్ప, మార్చి 16(ఆంధ్రజ్యోతి) : సమాజమార్పిడికి మహనీయుల తత్వ సిద్ధాంతాలను పాటించాలని తహసీల్దార్ విశ్వనాథ్ పిలుపునిచ్చారు. ఆదివారం సిరుగుప్ప పట్టణం తహసీల్దార్ కార్యాలయంలో యోగినారాయణ 300వ జయంతి వేడుకలను నిర్వహించారు. ఆయన భావచిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నేటి రోజుల్లో మహనీయుల చరిత్రలు తెలుసుకోవడం ఎంతో అవసరమని ఆయన తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ సిద్ధార్థ, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్లు సిబ్బంది, కౌన్సిలర్ నాగరాజ, మాంతేష పాల్గొన్నారు.

గుజిరీలో అగ్ని ప్రమాదం

● బూడిదైన సామగ్రి

కంప్లి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): విజయనగర జిల్లాలోని హువిన హడగలిలో మటన్ మార్కెట్ సమీపంలోని సలాం సాహెబ్‌కు చెందిన గుజరీ దుకాణంలో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి దుకాణం దగ్ధమైంది. లక్షల రూపాయలు నష్టంవాటిల్లినట్లు యజమాని వాపోయారు. సమాచారం అందుకున్న అగ్ని మాపక సిబ్బంది మంటలు ఆర్పే ప్రయత్నం చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. మంటల్లో పలు వస్తువులు కాలిపోయాయి. పరిహారం అందజేసి ఆదుకోవాలని బాధితుడు కోరారు.



చెలరేగుతున్న మంటలు

హోసూరు జోన్

మట్టి కుండలకు పెరిగిన ఆదరణ



అమ్మకానికి సిద్ధంగా ఉన్న మట్టికుండలు

హోసూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): దాహార్తిని తీర్చుకునేందుకు చల్లటి నీరు తాగడం సాధారణం అయితే ఫ్రిజ్ నీటికంటే సహజసిద్ధమైన మట్టి కుండలలో నీటిని తాగేందుకు ప్రజలు ఆసక్తి చూపడంతో వాటికి ఆదరణ పెరిగింది. నాలుగైదు రోజులుగా ఎండల ప్రభావం పెరిగింది. ఈ నేపథ్యంలో మట్టి కుండలను కొనుగోలు చేసేవారు కూడా పెరిగారు. దీంతో కుమ్మరులు హర్షం వ్యక్తం చేస్తూ వివిధ రకాల సైజులలో ఉన్న కుండలకు కొళాయిలతో కూడినవి అందుబాటులోకి తెచ్చారు. బాగలూరు, ఉద్దన్నపల్లి, బాగలూరు, బీర్జేపల్లి, ప్రాంతాల్లో వివిధ రకాల కుండలు లభిస్తున్నాయి. సాధారణంగా పొంగల్ సీజన్‌లో మాత్రమే మట్టి కుండలు మాత్రమే కొనుగోలు చేసేవారని ఇటీవలి కాలంలో ప్రజలలో మార్పు రావడంతో వేసవిలో కుండలు కొనుగోలు చేస్తున్నారని కొందరులు కుమ్మరిలు అభిప్రాయపడ్డారు. పాఠశాలల్లో, కళాశాలల్లో, వాణిజ్య సంస్థల్లో సైతం మట్టి కుండలు ఏర్పాటు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. పెద్ద కుండలు రూ.250 నుంచి రూ.400 వరకు ధర ఉన్నట్టు తెలిపారు.

కిడ్నీ సమస్యలపై జాగృతి శిబిరం



జాగృతి వాహనానికి పచ్చజెండా ఊపుతున్న వైద్యులు

హోసూరు, మార్చి 16(ఆంధ్రజ్యోతి): వరల్డ్ కిడ్నీ డేలో భాగంగా హోసూరు కావేరీ ఆసుపత్రి ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కిడ్నీ వ్యాధిగ్రస్తులను ఒకచోట చేర్చి, సమస్యలపై అవగాహన కల్పించేలా కార్యక్రమం చేపట్టారు. ఇదే సందర్భంగా అవగాహన కల్పించేందుకు వీధి నాటకాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో కావేరి హాస్పిటల్ యూరాలజిస్ట్ సాయిసమీర అవగాహన వాహనానికి పచ్చజెండా చూపారు. ఆసుపత్రి డాక్టర్ అరవిందన్, నిర్వాహకులు జోస్ వర్గీస్‌జాయ్, బిందుకుమారి, డాక్టర్ శ్రీరామజయం, ఆసుపత్రి సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు.



చంద్రచూడేశ్వరుడికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

ఘనంగా చంద్రచూడేశ్వర స్వామి తెప్పోత్సవం

హోసూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): హోసూరు నగరంలోని మరగతాంబ సమేత చంద్రచూడేశ్వర తెప్పోఉత్సవం ఆదివారం రాత్రి తేరుపేటలోని పుష్కరిణిలో వైభవంగా జరిగింది. రథోత్సవం జరిగిన రెండు రోజులకు స్వామివార్లకు తెప్పోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా ఉంది. స్వామి వార్లను అలంకరించి మేళాతాళాలతో పల్లకిలో ఉంచి కోనేరులో తెప్పోత్సవం జరిగింది. అర్చకులు వాంచీస్వరన్ నేతృత్వంలో ధార్మిక కార్యక్రమాలు సాగాయి. మూడు సార్లు ప్రదక్షిణ చేసి తర్వాత స్వామి వార్లను తిరిగి ఆలయానికి తీసుకెళ్లారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా అగ్నిమాపక సిబ్బంది భద్రతా చర్యల్లో పాల్గొన్నారు. తెప్పోత్సవం సాగుతున్న వేళ పల్లకీపై భక్తులు ఉప్పు, మిరియాలు వేసి మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవంలో మాజీ ఎమ్మెల్యే మనోహరన్, మున్సిపల్ హెల్త్‌కమిటీ ఛైర్మెన్ మాదేశ్వరన్, బీజేపి జిల్లా మాజీ అధ్యక్షుడు నాగరాజు పాల్గొన్నారు.

సంబరంగా శ్రీకృష్ణదేవరాయల పట్టాభిషేకం



మేయర్ సత్యకు వినతి పత్రం అందజేస్తున్న ఆంధ్ర కళాసమితి సభ్యులు

హోసూరు, మార్చి 16(ఆంధ్రజ్యోతి): హోసూరు కామరాజ్ కాలనీలోని ఆంధ్ర సాంస్కృతిక సమితి భవనంలో ఆదివారం శ్రీకృష్ణదేవరాయల పట్టాభిషేకం కార్యక్రమం ఘనంగా జరిగింది. మేయర్ సత్య, డిప్యూటీ మేయర్ ఆనందయ్య, ముఖ్య అతిథులుగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. ఆంధ్ర సాంస్కృతిక సమితి ఏటా శ్రీ కృష్ణదేవరాయల పట్టాభిషేకం కార్యక్రమం నిర్వహిస్తున్నారు. హోసూరు ప్రాంతంలో మాతృభాషను, సంస్కృతిని సంరక్షణకు సమితి కృషి చేస్తోంది. దోణాచలం సహస్రావధాని గండ్లూరి దత్తాత్రేయశర్మచే తెలుగు భాషోద్యమ నాయకుడు కే.ఎస్. కోదండరామయ్య స్మారకోపన్యాసం, మణిమంజిరి తదితర కార్యక్రమాలు సభికులను అలరించాయి. హైదరాబాద్‌కు చెందిన కే.ఎల్.కామేశ్వరరావుచే చమత్కార కవిరత్న, అలాగే దత్తాత్రేయశర్మ మార్గదర్శకత్వంలో నిర్వహించిన భువనవిజయం నాటక ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. జక్కేరికి చెందిన బాలకృష్ణచే ఏకపాత్రాభినయం, తెలుగు భాషా వికాస ఉద్యమం, ఉపాధ్యక్షులు రంగారెడ్డి, ఉపకార్యదర్శి సూర్యనారాయణ, ఎం.ఎస్.రామస్వామి రెడ్డి,సీతారామయ్య, కేఎస్.కృష్ణప్ప, వెంకటేశ్, ఎస్.టి. రాజు, ఎం.ఎస్.విజయ్‌కుమార్ పాల్గొన్నారు.



భువనవిజయం నాటకంలోని సన్నివేశం

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కామత్...

డాక్టర్ డీవీ గుండప్ప (జయంతి)



డీవీజీగా పేరొందిన 'పద్మభూషణ్' గ్రహీత డాక్టర్ దేవనహళ్ళి వెంకట రమణయ్య (డీవీ) గుండప్ప 1887 మార్చి 17న మైసూరులో జన్మించారు. కన్నడ కవి, రచయిత, తత్వవేత్త. ఆయన రచించిన 'మంకు తిమ్మన కగ్గ' ఎంతో పేరొందింది. 1906-07లో భారత్, కర్ణాటక అనే కన్నడపత్రికలను ప్రారంభించారు. 'సుమతి' వారపత్రిక నడిపారు. 'ది కర్ణాటక' అనే ఆంగ్లపత్రికను 'దివాన్' విశ్వేశ్వరయ్య సహకారంతో ప్రచురించారు. సాహిత్య అకాడమీ పురస్కారం, ఇతర అవార్డులు పొందారు. 1975 అక్టోబరు 7న కన్నుమూశారు.

పుతిన (జయంతి)



'పద్మశ్రీ' గ్రహీత పురోహిత తిరునారాయణ నరసింహాచార్ (పుతిన) 1905 మార్చి 17న కర్ణాటక రాష్ట్రం మండ్య జిల్లా మేలుకోటెలో జన్మించారు. కన్నడ ప్రఖ్యాత విద్వాంసుడు, సాహితీవేత్త. కువెంపు, బేంద్రె, పుతినలను కన్నడ నవోద్యమ కవులుగా వ్యవహరిస్తుంటారు. ఆయన రాసిన గీత నాటకాలు ఎంతో పేరొందాయి. కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం, పంప పురస్కారం, నాడోజా, రాజ్యోత్సవ తదితర అవార్డులు పొందారు. 1998 అక్టోబరు 23న కన్నుమూశారు.

కల్పనాచావ్లా (జయంతి)




అంతరిక్షయానం చేసిన తొలి భారతీయ మహిళగా చరిత్ర సృష్టించిన కల్పనా చావ్లా 1962 మార్చి 17న హరియాణ రాష్ట్రం కర్నాల్ పట్టణంలో జన్మించారు. ఇండో-అమెరికన్ వ్యోమగామి, ఇంజనీర్. ఆమె 376 గంటలపాటు అంతరిక్షంలో గడిపారు. ప్రైమరీ రోబోటిక్ ఆర్మ్ ఆపరేటర్, మిషన్ స్పెషలిస్ట్. 2003 ఫిబ్రవరి 1న కన్నుమూశారు. మరణానంతరం ఆమె జ్ఞాపకార్థం పలు గౌరవాలు ప్రకటించారు. 2003 ఫిబ్రవరి 3న అప్పటి ప్రధాని వాజ్‌పేయ్ కొన్ని శాటిలైట్స్‌కు ఆమె జ్ఞాపకార్థం కల్పనా పేరు పెట్టారు.

పునీత్‌రాజ్‌కుమార్ (జయంతి)



కన్నడ నటుడు పునీత్‌రాజ్ కుమార్ 1975 మార్చి 17న జన్మించారు. కన్నడ కంఠీరవుడు డాక్టర్ రాజకుమార్ తనయుడు. ముద్దుపేరు అప్పు. కన్నడనాట అత్యధిక పారితోషికం అందుకున్న నటులలో ఒకరు. బాల నటుడి నుంచి హీరోగా ఎదిగారు. పాటలు పాడడమే కాక నిర్మాతగాను రాణించారు. బుల్లితెరపైనా సత్తా చాటుకున్నారు. నేషనల్ ఫిల్మ్ అవార్డుతోపాటు పలు పురస్కారాలు అందుకున్నారు. అనేక ఉత్పత్తులకు రాయబారిగా వ్యవహరించారు. 46వ యేట 2021 అక్టోబరు 29న కన్నుమూశారు. ఆయన సినీ, సమాజసేవలను గుర్తిస్తూ మరణానంతరం 'కర్ణాటక రత్న' గౌరవాన్ని ప్రభుత్వం ప్రకటించింది.

సత్తిరాజు సీతారామయ్య (వర్ధంతి)



ప్రముఖ పాత్రికేయుడు, రచయిత, సామాజికవాది సత్తిరాజు సీతారామయ్య 1864 డిసెంబరు 11న పశ్చిమగోదావరి జిల్లాలో ఇరగవరం మండలం కంతేరు గ్రామంలో జన్మించారు. 1893లో 'దేశోపకారి' పత్రికను, 1902లో 'హిందూసుందరి' మాసపత్రికను ప్రారంభించారు. న్యాయవాదిగా కెరీర్ ఆరంభించి పత్రికలకోసం వృత్తిని వదిలేశారు. ఏలూరు మునిసిపల్ కౌన్సిలర్‌గా, కంతేరు గ్రామ పంచాయతీ అధ్యక్షుడిగా, తాలూకా బోర్డు సభ్యుడిగా పలు హోదాలలో సేవలందించారు. పలు తాళపత్ర గ్రంథాలను, శాసనాలను, వ్రాతప్రతులను సేకరించి మద్రాసు మ్యూజియంకు ఇచ్చారు. ఆయన దివంగత బాపు తాతగారి పెద్దసోదరుడు. 1945 మార్చి 17న కన్నుమూశారు.

సైనా నెహ్వాల్ (పుట్టినరోజు)



'పద్మభూషణ్' గ్రహీత సైనా నెహ్వాల్ 1990 మార్చి 17న హరియాణ రాష్ట్రం హిస్సార్‌లో జన్మించారు. దేశంలో పేరొందిన తొలి మహిళా బ్యాడ్మింటన్ క్రీడాకారిణి. 2015లో వరల్డ్‌నెంబర్ 1 ర్యాంకింగ్‌లో నిలిచారు. కామన్వెల్త్‌లో సింగిల్స్‌లో రెండుసార్లు బంగారుపతకం సాధించారు. 24కుపైగా ఇంటర్నేషనల్ టైటిల్స్ సాధించారు. ఒలింపిక్స్‌లో భారతదేశం తరపున మూడుసార్లు ప్రాతినిథ్యం వహించగా రెండోసారి కాంస్యపతకం సాధించారు. బ్యాడ్మింటన్‌లో పలుమైలురాళ్లు నెలకొల్పారు. 2023 సీజన్‌లో ఫలితాలలో ప్రపంచంలో 26వ నెంబరుకు చేరారు. రాజీవ్ గాంధీ ఖేల్‌రత్న, అర్జున అవార్డు తదితర అవార్డులు సాధించారు. అంతేకాక సమాజసేవా కార్యక్రమాల్లోనూ చురుగ్గా ఉన్నారు.

త్యాగానికి ప్రతిరూపం పొట్టి శ్రీరాములు : జేసీ

పుట్టపర్తిటౌన్, మార్చి16(ఆంధ్రజ్యోతి): త్యాగానికి ప్రతిరూపం అమరజీవి పొట్టి శ్రీరాములు అని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ కొనియాడారు. పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఆదివారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ భవనంలో వివిధ శాఖల అధికారులతో కలిసి జేసీ.. పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ.. తెలుగు వారికి ప్రత్యేక రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుడు పొట్టిశ్రీరాములు అన్నారు.



పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న జేసీ

టౌన్‌షిప్‌తో అభివృద్ధికి బాటలు: మంత్రి బైరతి సురేశ్



ఎమ్మెల్యేలతో మంత్రి బైరతి సురేశ్ తదితరులు

బంగారపేట, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): కరువుపీడిత ప్రదేశంలో అత్యాధునిక ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్ ఏర్పాటు ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరిగి అభివృద్ధికి బాటలు కానున్నాయని కోలారు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బైరతి సురేశ్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని ఎమ్మెల్యే నివాసానికి వచ్చినవేళ మంత్రి మీడియాతో మాట్లాడారు. కెజిఎఫ్, బంగారపేటల మధ్య ప్రైవేట్ సహకారంతో 300 ఎకరాలలో ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్ నిర్మాణానికి ముఖ్యమంత్రి అంగీకరించారని ఆమేరకు బంగారపేట, కేజీఎఫ్‌లతో కలసి స్థలాన్ని పరిశీలించేందుకు వచ్చినట్టు తెలిపారు. త్వరలోనే వేల కోట్ల రూపాయలతో అత్యాధునిక సౌలభ్యాలతో బెంగళూరు తరహాలో టౌన్‌షిప్‌ను తీర్చిదిద్దనున్నట్టు తెలిపారు. కాగా కేసీవ్యాలి నీటి కేటాయింపులో తలెత్తిన సమస్యను సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరిస్తామన్నారు. కోచిముల్ విభజన, అక్రమాల ఆరోపణలకు సంబంధించి సమగ్ర వివరాలు లేవన్నారు. ఎమ్మెల్యే నారాయణస్వామి, నంజేగౌడ ఇద్దరూ కాంగ్రెస్ వారేనని చిన్నాచితకా భేదాభిప్రాయాలను చర్చలతో ముగిస్తామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎస్ఎన్ నారాయణస్వామి, కేజీఎఫ్ ఎమ్మెల్యే రూపకళ శశిధర్, కేడీపీ అధ్యక్షుడు గోపాలరెడ్డి, పికార్డ్‌బ్యాంకు అధ్యక్షుడు రఘునాథ్, పురసభ అధ్యక్షుడు గోవింద, గ్యారెంటీ సమితి అధ్యక్షుడు పార్థసారథి, పురసభ సభ్యులు షఫి, రాకేశ్, వివేకానంద తదితరులు పాల్గొన్నారు.

నమ్మ క్లినిక్‌తో నాణ్యమైన వైద్యసేవలు

బాగేపల్లి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): బాగేపల్లి తాలూకాలో ప్రజల డిమాండ్లకు అనుగుణంగా రాష్ట్రప్రభుత్వం ఏర్పాటు చేసిన నమ్మ క్లినిక్‌తో నాణ్యమైన వైద్యసేవలు సాధ్యమని ఎమ్మెల్యే ఎస్ఎన్ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. ఘంటంవారిపల్లి గ్రామపంచాయతీ కేఎస్ఆర్టీసీ డిపో రోడ్డులోని నమ్మ క్లినిక్‌ను ఎమ్మెల్యే లాంఛనంగా ప్రారంభించి మాట్లాడారు. సామాన్యులకు సైతం ఉత్తమ సేవలు అందించడమే పథకం ఉద్దేశ్యమన్నారు. ఆధునిక సాంకేతిక సేవలను సైతం అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. తాలూకా ఆరోగ్య అధికారి డాక్టర్ సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ఉదయం 9 గంటలనుంచి సాయంత్రం 4.30వరకు సోమవారం నుంచి శనివారం వరకు క్లినిక్ పనిచేస్తాయన్నారు. వెయ్యి చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన క్లినిక్‌లో అవుట్ పేషంట్‌లకు పరీక్షలు, ల్యాబ్, మందుల నిల్వ, పంపిణీ గది, పాలనా కేంద్రం, శౌచాలయ వ్యవస్థ ఉన్నాయన్నారు. నమ్మక్లినిక్ డాక్టర్ పవన్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో ఒక వైద్యాధికారి, నర్సు, ల్యాబ్ టెక్నీషియన్, డిగ్రేడ్ ఉద్యోగి ఉంటారన్నారు. సామాన్యులకు కూలి కార్మికులకు ఈ కేంద్రం ద్వారా వైద్యసేవలు అందుబాటులో ఉంటాయన్నారు. జిల్లా ఆరోగ్య అధికారులు, మహేశ్‌బాబు, ఆర్‌సీహెచ్‌ఓ డాక్టర్ సంతోష్‌బాబు, ఆర్ హనుమంతరెడ్డి, గ్రామపంచాయతీ అధ్యక్షుడు ఎస్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.



నమ్మ క్లినిక్‌లో ఎమ్మెల్యే సుబ్బారెడ్డి తదితరులు

కిడ్నీ సమస్యలపై వాకథాన్

బెంగళూరు, మార్చి 16(ఆంధ్రజ్యోతి): ఇటీవలి కాలంలో కిడ్నీ సమస్యలు ఎదుర్కొంటున్నవారు అధికమయ్యారని ఈ నేపథ్యంలో మూత్రపిండాల ఆరోగ్యంపై జాగృతి కల్పించేలా నగరంలో వాకథాన్ నిర్వహించారు. వరల్డ్ కిడ్నీ డేలో భాగంగా బెంగళూరు కిడ్నీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నగరంలోని బసవనగుడిలో ఆదివారం వాకథాన్ చేపట్టారు. శంకర క్యాన్సర్ హాస్పిటల్ పార్కింగ్ స్థలం వద్ద వాకథాన్‌కు పచ్చజెండా చూపారు. రోజూ కొద్దిసేపు నడక చేయడం జీవితంలో భాగం కావాలని తద్వారా మెరుగైన ఆరోగ్యం సాధ్యమని వక్తలు పేర్కొన్నారు. వాకథాన్ అనంతరం ఇందులో పాల్గొన్న వారికి అల్పాహార వ్యవస్థ కల్పించారు.



వాకథాన్‌లో పాల్గొన్న ప్రజలు

ఘనంగా వేణుగోపాల స్వామి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

ముళబాగిలు, మార్చి 16(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని తిరుమన హళ్ళి గ్రామంలో పురాణ ప్రసిద్ధమైన వేణుగోపాల స్వామి బ్రహ్మరథోత్సవం ఘనంగా జరిగింది. తొలుత మూల విరాట్టుకు పంచామృతాభిషేకం, విశేష పుష్పాలంకరణ జరిగాయి. తిరుమల ప్యాన్సీస్టోర్ యజమాని తవడా కృష్ణప్ప, కుటుంబీకులు ప్రసాద వినియోగం చేశారు. ఇతర సేవాకర్తలచే అన్న సంతర్పణ జరిగింది. రథోత్సవం నేపథ్యంలో ఆలయాన్ని తోరణా లతో ముస్తాబు చేయగా వాద్యగోష్టి, కళాకారుల సందడి ఆకట్టుకుంది. ఉత్సవంలో మాజీ మంత్రి హెచ్ నాగేశ్, తాలూకా పంచా యతీ మాజీ అధ్యక్షుడు ఏవీ శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు ఆదినారాయణ, రామలింగారెడ్డి, ఆలంగూరు శివణ్ణ, గుజ్జన హళ్ళి మంజునాథ్, రంగస్వామి పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు ప్రొఫెసర్ దొరస్వామి

▸▸ శ్రద్ధాంజలి సభలో ప్రతిపక్షనేత అశోక్

బెంగళూరు, మార్చి 16(ఆంధ్రజ్యోతి): విద్యాసంస్థలలో గుణాత్మకత పెరగాలని ఐదు దశాబ్దాలపాటు అహర్నిశలు కృషి చేసిన ప్రొఫెసర్ దొరస్వామి ఆదర్శప్రాయుడని ప్రతిపక్షనేత అశోక్ కొనియాడారు. ఆదివారం ప్యాలెస్ మైదానంలో వైట్‌పెటల్స్‌లో దొరస్వామి శ్రద్ధాంజలి సభ జరిగింది. ఈ సందర్భంగా దొరస్వామి చిత్రపటానికి పూలుచల్లి నివాళులు అర్పించారు. అనంతరం అశోక్ మాట్లాడుతూ పీఈఎస్ విద్యాసంస్థలు జాతీయ, అంతర్జాతీయస్థాయిలో రాణించేందుకు దొరస్వామి నిరంతర కృషి కారణమన్నారు. మాజీ డీసీఎం అశ్వత్థనారాయణ, చిత్తూరు జిల్లా చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ మురళి మోహన్‌లు నివాళులు అర్పించారు. కమ్మవారిసంఘం ప్రతినిధులతోపాటు తెలుగు విజ్ఞాన సమితి అధ్యక్షులు రాధాకృష్ణరాజు సహా పలువురు అభిమానులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జవహర్ దొరస్వామి, ఇతర కుటుంబీకులను పలువురు పరామర్శించారు. ప్రముఖ వైద్యురాలు విజయలక్ష్మి బాళెకుంద్రి, కట్టా సుబ్రహ్మణ్యం నాయుడు, చిత్తూరు జిల్లాకు చెందిన మేదరమెట్ల మోహన్ నాయుడుతోపాటు రాజకీయ నాయకులు, అధికారులు, విద్యానిపుణులు, పీఈఎస్ యూనివర్సిటీ, మెడికల్ కళాశాల, విద్యాసంస్థల ముఖ్యులు పాల్గొన్నారు.



నివాళులు అర్పిస్తున్న మాజీ డీసీఎం అశ్వత్థనారాయణ తదితరులు

హైటెక్ క్రీడామైదానం నిర్మాణానికి శ్రీకారం

ముళబాగిలు, మార్చి 16(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని హనుమనహళ్ళి వద్ద 25 ఎకరాలలో హైటెక్ క్రీడామైదానం నిర్మించనున్నట్టు ఎమ్మెల్యే సమృద్ధి మంజునాథ్ తెలిపారు. తాలూకా లోని బెస్తరహళ్ళి, వానగానహళ్ళి వరకు రోడ్డు అభివృద్ధి పనులకు భూమిపూజ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. ముళబాగిలు పట్టణం లో నేతాజి క్రీడా మైదానం అభి వృద్ధికి రూ.1.5కోట్లు మంజూరు చేయగా ఇప్పటికే రూ.50లక్షలు విడుదల అయ్యాయన్నారు. తాలూకాలో 125 కిలోమీటర్ల మేర రోడ్డు అభివృద్ధి పనులు పూర్తి చేయడానికి తీర్మానించినట్టు తెలిపారు. కిరుమణి, చన్నాపుర, తాయలూరు, రోడ్లతోపాటు బెస్తరహళ్ళి నుంచి వానగనహళ్ళి వరకు రూ.4 కోట్లతో [illegible] చేపట్టనున్నట్లు తెలిపారు. శాసనసభ సమావేశాలలో తాలూకా అభివృద్ధి పనులకు మరింత గ్రాంట్లు కోరనున్నట్టు తెలిపారు. తాలూకాలోని గుడిసెల రహితంగా మార్చే ఆశయం కలిగినట్టు తెలిపారు. ఇప్పటికే వసతి రహితుల జాబితాను సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పించినట్టు తెలిపారు. కాగా త్వరలోనే అంబేడ్కర్ విగ్రహం నుంచి కేజీఎఫ్ మెయిన్ రోడ్డు బైపాస్ వరకు రోడ్డు డాంబరీకరణ పనులు చేపట్టనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో జేడీఎస్ నాయకుడు బీఎంసీ వెంకటరామేగౌడ, బీవీ సామేగౌడ, నారాయణగౌడ, నల్లూరు రఘుపతిరెడ్డి, రోటరీ అధ్యక్షుడు నగవార సత్యణ్ణ, గ్రామపంచాయతీ అధ్యక్షురాలు నాగవేణి, ఉపాధ్యక్షుడు లక్ష్మి నారాయణ, పీడీఓ వెంకటేశ్ పాల్గొన్నారు.



భూమిపూజలో ఎమ్మెల్యే సమృద్ధి మంజునాథ్

ఉపాధ్యాయుల పాత్ర కీలకం



ఉపాధ్యాయులకు ఆత్మీయ సన్మానం

మహదేవపుర, మార్చి 16(ఆంధ్రజ్యోతి): పిల్లలను ఉత్తమ పౌరులుగా తీర్చడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని భారతీయసేవా సమితి జాతీయ అధ్యక్షుడు హరాడి రామచంద్ర పేర్కొన్నారు. హరాడిలోని ప్రభుత్వ మాదిరి ప్రాథమిక పాఠశాలలో గురువందన కార్యక్రమంలో ఉపాధ్యాయులను ఆత్మీయంగా సత్కరించారు. ఈ సందర్భంగా రామచంద్ర మాట్లాడుతూ.. బాల్యంలోనే తప్పులను దిద్ది చక్కటి మార్గంలో వెళ్లేలా బాటలు వేయడంతోపాటు నైతిక విలువలు పెంపొందించడంలో ఉపాధ్యాయుల పాత్ర అనన్యమని కొనియాడారు. ప్రభుత్వ పాఠశాలలో చదివిన ఎంతోమంది ఉన్నత హోదాలలో ఉన్నారని, తాను కూడా ఈపాఠశాల పూర్వపు విద్యార్థినన్నారు. ఏటా గురువందన ద్వారా ఉపాధ్యాయులను సత్కరించే అవకాశం లభించడం తన సౌభాగ్యమన్నారు.

ఆలయ భూమిపై వివాదం

ధర్మవరంరూరల్, మార్చి16(ఆంధ్రజ్యోతి):మండలంలోని నిమ్మలకుంట వద్ద ఉన్న ఆంజనేయస్వామి మాన్యంభూమి విషయమై ఆదివారం వివాదం తలెత్తింది. మాన్యంభూమిలోని దేవాలయంలో నివాసం ఉంటున్న శింగంశెట్టి కుళ్లాయప్పను ఖాళీచేసి వెళ్లిపోవాలని సీసీ కొత్తకోట గ్రామస్థులు నిలదీశారు. పోలీసులు, సీసీకొత్తకోట గ్రామస్థులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి సంబంధించి ఆంజనేయస్వామి మాన్యంభూమి నిమ్మలకుంట వద్ద సుమారు 22 ఎకరాలు ఉంది. 10 ఏళ్ల కిందట పట్టు పరిశ్రమ శాఖ రిటైర్డ్ అధికారి నిమ్మలకుంటకు చెందిన శింగంశెట్టి కుళ్లాయప్ప మాన్యం భూమిలోని చిన్నపాటి ఆంజనేయస్వామి దేవాలయాన్ని తొలగించి, నూతనంగా నిర్మించాడు. అక్కడే స్థిరనివాసం ఏర్పాటు చేసుకున్నాడు. కల్యాణమండపాన్ని ఏర్పాటు చేసుకుని, ఆలయాన్ని పూర్తిస్థాయిలో స్వాధీనంలోకి తీసుకున్నాడు. 2.23 ఎకరాల ఆలయ భూమికి తన బంధువైన శింగంశెట్టి బాబు రాజేంద్రప్రసాద్ పేరుమీద పట్టా తెచ్చుకున్నాడని గ్రామస్థులు ఆరోపించారు. విషయం తెలుసుకున్న సీసీ కొత్తకోట గ్రామస్థులు 50 మంది దాకా ఆలయం వద్దకు వెళ్లి, శింగంశెట్టి కుళ్లాయప్పతో వాగ్వాదానికి దిగారు. గ్రామానికి చెందిన మాన్యంభూమిలో పట్టా ఎలా తెచ్చుకున్నారని ప్రశ్నించారు. కల్యాణమండపంలోని సామగ్రిని బయటకు వేశారు. విషయం తెలుసుకున్న రూరల్ సీఐ ప్రభాకర్.. సిబ్బందితో అక్కడికి చేరుకుని, గ్రామస్థులతో మాట్లాడారు. దేవదాయ శాఖ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని చెప్పడంతో గ్రామస్థులు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

చెత్త సేకరణకు సహకరించాలి



నూతన చెత్త సేకరణ వాహనాలు

శిడ్లఘట్ట, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): తడిపొడి చెత్త సేకరణకు ప్రజలు సహకరించాలని జిల్లా పంచాయతీ ఉపకార్యదర్శి అతీక్ పాషా ప్రజలకు పిలుపునిచ్చారు. తాలూకాలోని మళమాచనహళ్ళి గ్రామపంచాయతీ పరిధిలోని ఘనత్యాజ్య సంస్కరణ కేంద్రానికి అవసరమైన చెత్త సేకరణ వాహనాలకు పచ్చజెండా చూపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చెత్తను తడి పొడిగా వేర్వేరు చేయాలని, కూరగాయలు, పండ్ల వ్యర్థాలు వేరుగాను ప్లాస్టిక్, బాటిల్, ఇతర వ్యర్థాలను విభజించాలన్నారు. తొలుత తడి పొడి చెత్తను వేర్వేరుగా చేపట్టాలని, ప్రజలు ఈ దిశగా ఇళ్లల్లోనే వేర్వేరుగా విభజించి చెత్త సేకరణ ఇవ్వాలని సూచించారు. తద్వారా వ్యర్థాలతో ఎరువుల నిర్వహణ సాధ్యమన్నారు. ఈ సందర్భంగా ఆనూరు, భక్తరహళ్ళి, మళమాచనహళ్ళి, హండిగనాళ, జంగమకోటె, హొసపేట, నాగమంగల, మళ్ళూరు, మేలూరు, వెంకటాపుర గ్రామపంచాయతీల స్వచ్ఛతా వాహనాలకు పచ్చజెండా చూపారు. ఈ సందర్భంగా నరేగా సహాయ డైరెక్టర్ చంద్రప్ప, గ్రామపంచాయతీల పీడీఓలు, గ్రామపంచాయతీ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా దేహదారుఢ్య పోటీలు



ట్రోఫీలతో విజేతలు

మహదేవపుర, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని రామగొండనహళ్ళిలో జాతీయస్థాయి దేహధారుఢ్యపోటీలు ఉత్సాహంగా జరిగాయి. ఎం శ్రీనివాస్ నేతృత్వంలో రాక్స్ జిమ్, ఉత్తమ కర్ణాటక దేహధారుఢ్య అండ్ ఫిట్‌నెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 17వ వార్షిక పోటీలు నిర్వహించారు. వివిధ రాష్ట్రాలకు చెందిన వారు 300మందికిపైగా పాల్గొన్నారు. మిస్టర్ మహదేవపుర అవార్డును రాజశేఖర్ దక్కించుకోగా మిస్టర్ రాక్స్ క్లాజిక్‌గా ధనంజయ నిలిచారు. పోటీల విజేతలకు మాజీ మంత్రి అరవింద లింబావళి జ్ఞాపికలు అందచేశారు. ఈ సందర్భంగా బీజేపీ స్థానిక అధ్య క్షుడు హరాడి పిళ్ళప్ప, శ్రీధర్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర పరిషత్ సభ్యుడు ఎల్ రాజేశ్, వర్తూరు శ్రీధర్, సంజయ్‌శర్మ, కామేశ్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఎస్ఆర్ లేఅవుట్‌లో పునీత్‌రాజ్‌కుమార్ ట్రోఫీ



క్రీడాకారులతో నిర్వాహకులు

బొమ్మనహళ్ళి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): పునీత్‌రాజ్‌కుమార్ జయంతి సందర్భంగా ఆయన పేరిట క్రికెట్ ట్రోఫీని హెచ్ఎస్ఆర్ లే అవుట్‌లో నిర్వహించారు. స్థానిక బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు టి వాసుదేవరెడ్డి పోటీలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నటుడిగానే కాకుండా గొప్ప సామాజిక సేవలతో పునీత్‌రాజ్‌కుమార్ నిలిచారన్నారు. ఆయన చేసిన సేవలు ఇతర రాజకీయనాయకులతో పోల్చలేమన్నారు. గొప్పనటుడు మనమధ్య లేకపోవడం విచారకరమన్నారు. తొలుత పునీత్ చిత్రపటానికి పూలుచల్లి నివాళులు అర్పించారు. శని, ఆదివారాలలో రెండు రోజులపాటు ట్రోఫీ పోటీలు జరిగాయి. విజేతలకు ట్రోఫీ, జ్ఞాపిక అందచేశారు. కృష్ణ, దినేశ్, శ్రీనివాస్, గోపి, శ్యామసుందర్, రంగనాథ్ తదితర క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు.

బస్‌షెల్టర్ నిర్మించాలి



బస్టాప్‌లో వేచివున్న ప్రజలు

చేళూరు, మార్చి 16(ఆంధ్రజ్యోతి): తాలూకా కేంద్రమైన చేళూరు నుంచి పాతపాలెంకు వెళ్లే మార్గంలో సోమనాథపురం గ్రామ పంచాయతీలో బస్ షెల్టర్ ఏర్పాటు చేయాలని గ్రామస్థుల డిమాండ్‌గా ఉంది. సరైన బస్‌షెల్టర్ లేకపోవడంతో చెట్ల కింద, దుకాణాల వద్ద విద్యార్థులు వేచి ఉంటున్నారు. బస్సుల సదుపాయం ఉన్నప్పటికీ సరైన వేచి ఉండేందుకు సరైన సదుపాయం లేక ఇబ్బంది పడుతున్నట్టు విద్యా ర్థులు, ప్రయాణికులు వాపోతున్నారు.